

విశాలాంధ్ర శ్రీకాకుళం

సోమవారం 20, మే 2024

ఘనంగా ప్రారంభమైన శ్రీ త్రినాధస్వాముల మహోత్సవములు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మండలం చౌదరి కొత్తూరు గ్రామంలో శ్రీ త్రినాధస్వాములు మహోత్సవములు ఆదివారం ఆలయధర్మకర్త రొక్కం సూర్యప్రకాష్ దొర ఆద్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ త్రినాధస్వాముల మహోత్సవములు ఆదివారం నుంచి మంగళవారం వరకు అత్యంత భక్తి శ్రద్దలతో జరుగుతాయని ఈ గ్రామంతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హజరై త్రినాధస్వాములను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరుపుకుంటారని సూర్యప్రకాష్ తెలిపారు. ఈ మూడు రోజులు రొక్కం ఆనందరావు, రొక్కం ప్రకాశరావు, రొక్కం జగన్నాధరావు, నక్క తాతమ్మ, నక్క తాతయ్య, రొక్కం శ్రీధర్, రొక్కం తిరుపతిరావు, రొక్కం శ్రీరాములు ఆర్ధిక సహాయంలో వివిధ సాంస్కృతి కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని ఆయన తెలిపారు.

తోపులాటలో గాయపడిన వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: మండలం చిన్నవెంకటాపురం గ్రామంలో ఈనెల 16వతేదీన జరిగిన తోపులాటలో గాయపడిన తోట మల్లేష్ (60) విశాఖపట్నం కెజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడని టెక్కలి రూరల్ సీఐ సూర్యచంద్రమౌళి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఈనెల 16వ తేదీన మండలం చిన్నవెంకటాపురం గ్రామంలో ప్రతీ ఏడాదిలాగే ఈ సంవత్సరం పాతపట్నం అమ్మవారికి మొక్కులు చెల్లించడానికి గ్రామస్తులందరూ కోళ్ళు, మేకలు పట్టుకొని గుడివద్దకు చేరుకున్నారని, అయితే మృతుడు తోట మల్లేసు కోడి పట్టుకొని మొక్కు చెల్లించానికి ముందుకు రావడంతో ఇదే గ్రామానికి చెందిన పూతి లక్ష్మణరావు, పూతి భాను చందర్, పూతి కర్రెన్న, పూతి రమణ అనే నలుగురు ప్రతి సంవత్సరం మా కుటుంబమే కదా అమ్మవారికి ముందుగా మొక్కలు చెల్లించేది, ఇప్పుడు నువ్వేంటి అందరికంటే ముందు మొక్కు చెల్లించడానికి వచ్చావు అని మల్లేసును ప్రశ్నించారు. దీంతో మల్లేష్‌వైపు నుంచి ఐదుగురు వ్యక్తులు, పూతి దానమ్మ వైపు నలుగురు వ్యక్తులు ఒకరినొకరు తోసుకోవడంతో మల్లేష్ కిందివడి గాయపడ్డాడు. గాయపడిన మల్లేసును కోటబొమ్మాళి సామాజిక అసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్సకోసం శ్రీకాకుళం రిమ్స్‌కు వైద్యులు తరలించారు. అక్కడి మల్లేష్ పరిస్థితి విషమించటంతో అక్కడనుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లేష్ మృతి చెందాడని, ఘర్షణ పై ఇరువర్గాల ఇచ్చిన పిర్యాదులుపై ఎస్ఐ కేసు నమాదు చేసి ధర్యాప్తు చేస్తున్నామన్నారు. అయితే ఈ సంఘటనలో ఏ రాజకీయ ప్రమేయం లేదని, ఇరు వర్గాల వారు ఒకే కులస్తులు, దగ్గరి బంధువులు, ఒకే గ్రామానికి చెందిన వారని, వీరికి పాత రాజకీయ కక్షలు ఏమీ లేవని, అమ్మవారి మొక్కుబడి విషయంలో ఒకరినొకరు తోసుకోవడం వలన జరిగిన సంఘటనే తప్ప ఇందులో ఎటువంటి రాజకీయ ప్రమేయం లేదని సీఐ తెలిపారు.

రిగ్గింగ్‌ను అపాడనే అక్కసుతోనే మాదవ తండ్రిపై దాడి : మండలం నిమ్మాడ పంచాయతీ చిన్న వెంకటాపురం (బూత్ నెంబర్ 288)లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరుపున బూత్ ఏజెంటుగా దేవాది మాధవరావు ఉండి అక్కడ రిగ్గింగ్ జరగకుండా అపాడనే అక్కసుతో గ్రామంలో జరిగిన అమ్మవారి మొక్కుల చెల్లింపుల వారాలలో అచ్చెన్నాయుడు నేతృత్వంలో టీడీపీ నాయకులు మాదవ తండ్రి తోట మల్లేశ్వరరావుపై అతి దారుణంగా హత్యయత్నం చేయడంతో ఆయన మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచారని టెక్కలి వైసీపీ ఎమ్మేల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ ఒక ప్రకటనతో తెలిపారు. ఈ హత్యకు కారణమైన అచ్చెన్నాయుడు అనుచరులు భానుచంద్ర, పి. లక్ష్మణరావు, రమణ, కర్రెన్న ఇతర ముద్దాయిలను వెంటనే అరెస్టు చేయాలని దువ్వాడ శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

ఐటీఐతో ఉపాధికి బాట...

టెక్నికల్ కోర్సులతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు..!

విశాలాంధ్ర-పలాస : పదవ తరగతి పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. ఇప్పుడు సంబంధిత విద్యార్థులంతా పది అనంతరం చేరాల్సిన కోర్సులపై దృష్టిని కేంద్రీకరించారు. ఇప్పటికే పాలిసెట్, రెసిడెన్షియల్ ప్రవేశ పరీక్షల ఫలితాలు కూడా ప్రకటించారు. దీంతో పలువురు విద్యార్థులు వారి ఆసక్తిని బట్టి ఏఏ కోర్సులో చేరాలా అని ఆలోచనలో ఉన్నారు. అయితే అధిక శాతం మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ లో చేరుతున్నారు. ఇంకా విద్యార్థులు టెక్నికల్ కోర్సులైన పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యత ఇస్తారు. పదవ తరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి అవకాశాలు పొందేందుకు ఐటీఐ కోర్సులతో ఒక చక్కటి బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు.

18 ఏళ్లు దాటగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు... ఐటీఐ పూర్తి చేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఐటీఐ ఒక చక్కటి మార్గంగా ఉంటుంది. విద్యుత్, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఐటీఐ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగావకాశాలు త్వరితగతిన లభిస్తాయి. అయితే ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు స్కిల్ తప్పని సరిగా ఉండాలి. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాందించిన విద్యార్థులకు ఉపాధి తప్పని సరిగా లభిస్తుంది. ఇదిలా ఉంటే రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ, ఐటీఐల్లో స్కిల్ హబ్ లు ఏర్పాటు చేసి విద్యార్థులకు నైపుణ్య అంశాలపై శిక్షణ కూడా ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధి సైతం ఐటీఐ కోర్సు ఎంతో దోహదం చేస్తుంది.

జిల్లాలో 22 ఐటిఐలు....

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 5 ప్రభుత్వ 17 ప్రైవేటు ఐటీఐ కళాశాలలు ఉన్నాయి. శ్రీకాకుళం డీఎల్‌టిసితో పాటు ఎచేర్ల, పలాస, రాజాం, సీతంపేటలో ఉన్నాయి. వీటిల్లో సీట్ల కేటాయింపునకు సంబంధించి పదవ తరగతి మార్కులతో పాటు మెరిట్, రూల్స్ అఫ్ రిజ ర్వేషన్ ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుంది. మిగతా 17 ప్రైవేటు ఐటీఐలు ఉన్నాయి. కోర్సుల వివరాలు ఇలా.

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఎడాది, రెండు సంవత్సరాలకు సంబంధించిన పలు కోర్సులు ఉన్నాయి. ఇందులో రెండు సంవత్సరాలకు సంబంధించి ఎలక్ట్రికల్, ఫిట్టర్, మోటర్ మెకానిక్, డ్రాఫ్ట్ మ్యాన్ సివిల్, టర్నర్, మిషినిస్టు కోర్సులు ఉన్నాయి. అలాగే ఏడాదికి సంబంధించిన కోర్సుల్లో. కంప్యూటర్ కోర్సు(కోపా) డీజల్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్ కోర్సులు ఉన్నాయి. ఇందులో ఏడాదికి సంబంధించిన కోర్సులు పలాస ప్రభుత్వ డాక్టర్ కణితీష్ ఐటీఐ లో ఉన్నాయి. ఇక్కడ చదువుకునే విద్యార్థులకు భోజనంతో పాటు ఉచిత వసతి సౌకర్యం ఉంది.

ఉన్నత చదువులకు అవకాశం...

ఐటీఐలో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి ఉన్నత చదువులకు అవకాశం ఉంది. ఐటీఐ పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారు బీటెక్ లో ప్రవేశం పొందవచ్చు. ఈ విధంగా ఏటా పలువురు లేటరల్ ఎంట్రీని పొంది ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ అవకాశాలను పొందుతున్నారు.

వ్యవసాయ వ్యర్థాలతో కమ్ముకుంటున్న కాలుష్యం

- పొలాల్లో వరిగడ్డి కాల్చడంతో వాయుకాలుష్యం
- రైతులను చైతన్య పరచడంలో అధికారుల విఫలం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : వ్యవసాయం రంగంలో ఎరువులు, రసాయనాలు వాడకంతో, భూగర్భ జలాల కాలుష్యంతోపాటు తీవ్ర వాయికాలుష్యం అవుతుంది. పూర్వపు రోజుల్లో పంటలకు ఎరువులుగా పశువుల వ్యర్థాలు, వ్యవసాయ వ్యర్థాలు కొన్ని రోజులు మగ్గబెట్టి ఆ మిశ్రమాన్ని (గత్తం) పంటకు ఎరువుగా వాడే వారు. ప్రస్తుత రోజుల్లో వ్యవసాయలో విపరీతమైన రసాయనిక ఎరువుల వాడకం తో అన్ని విధాలుగా ఆ ప్రభావం మనుషుల మీద పడి తీవ్ర అనారోగ్య పరిస్థితులకు కారణం అవుతున్నాయి. ప్రస్తుత రోజుల్లో రైతు రసాయనిక ఎరువుల మీద మక్కువ చూపడంతో వ్యవసాయ వ్యర్థాలు కాల్చి వేయడంతో పొగ రూపంలో వాయు కాలుష్యం తీవ్రతరం అవుతుందని. వచ్చే పంట కాలానికి రైతులు సిద్ధం అవుతున్న తరుణం లో వ్యవసాయ వ్యర్థాలనుకాల్చి వేస్తున్నారు. దీంతో పల్లెల్లో ఎక్కడ చూసినా తీవ్ర పొగ గాలిలో కలిసి తీవ్ర వాయు కాలుష్యానికి తెలియకుండానే రైతులు కారణం అవుతున్నారు. వ్యవసాయ అధికారులు రైతుల కు వ్యవసాయ వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చే లా చైతన్య పరిచి ఈ వ్యర్థాలు ను కాల్చ కుండా చర్యలు తీసుకుంటే . రైతు కు లాభం తో పాటు కాలుష్యాన్ని కూడా నివారించవచ్చు.

- వ్యర్థాల కాల్చడంతో నష్టం... పొలములో పంట వ్యర్థాలు తగలబెట్టడం వల్ల వచ్చే పొగలోని సూక్ష్మ రేణువులు, కార్బన్ దయాక్సైడ్, నైట్రోజన్ దయాక్సైడ్, సల్ఫర్ దయాక్సైడ్ అన్నీ కలిసి కాలుష్యం తీవ్రమయ్యే సమయంలోనే బాణసంచా కాల్చడం వల్ల వెలువడే కాలుష్యం కన్నా మరింత తీవ్రంగా కాలుష్యం ఉంటుంది . సాధారణంగా ఒక టన్ను వ్యర్థాలను మండిస్తే 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్‌తో పాటు 1,400 కిలోల కార్బన్‌డై ఆక్సైడ్ గాలిలోకి విడుదల అవుతుంది.

ఇవే కాకుండా సూక్ష్మధూళి కణాలు, బూడిద గాలిలో కలవడం వల్ల వాయు కాలుష్యం పెరుగడంతో పాటు భూసారం సైతం క్షీణిస్తుంది. సూక్ష్మజీవుల సంఖ్య తగ్గిపోతుంది.

నేల పొరల్లో తేమశాతం ఆవిరై పంట దిగుబడి కూడా తగ్గిపోతుంది. గడ్డిని కుల్లబెట్టి గత్తముగా మార్చడం వలన పొలాన్ని కాపాడుతూ పర్యావరణాన్ని కాపాడాలి. వీలైనంతవరకు రైతులను చైత్యనపరచడం తో ఈ కాలుష్యాన్ని నివారించవచ్చు. ఆదిశగా అధికారులు కృషి చేస్తే అటు రైతు ఆర్థిక అభివృద్ధికి, ఇటు కాలుష్య నివారణకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

బ్రహ్మోత్సవాల్లో ముత్యాల పందిరి వాహన సేవలో నగర వాసి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ గోవింద రాజ స్వామి వారి అఖండ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నగరానికి చెందిన శ్రీ సంధ్య శ్రీ ప్రతీక భరతనాట్య కళాకారిణి బ్రహ్మోత్సవాల్లో ముత్యాల పందిరి వాహన సేవలో భరతనాట్య ప్రదర్శన చేసి ఆహుతులను మంత్రముగ్ధులను చేసింది. తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్వహించే ప్రతి కార్యక్రమంలో వీరు పాల్గొని ఆ స్వామివారి కి నృత్య నిరాజనం సమర్పించుకుంటున్నారని నిర్వాహకులు తెలిపారు.

ఎచ్చెర్లలో వెంకటేశ్వర స్వామి పాదాలు తాకిన సూర్యకిరణాలు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : కొండపై ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి పాదాలను ఆదివారం ఉదయం 5:15 గంటలకు సూర్య కిరాణాలు వైశాఖ మాసంలో ప్రతి ఏటా స్వామివారి పాదాలకు సూర్యకిరణాలు తాకుతుంటాయి ఈ అద్భుత ఘడియలు వీక్షించేందుకు భక్తులు ఆసక్తి చెబుతారని ఆలయ ధర్మకర్త డాక్టర్ గుంప శివప్రసాద్ అర్చకులు దూబ వైకుంఠ రావు (భవాని) తెలిపారు. దశమి నుంచి త్రయోదశి వరకు వరుసగా నాలుగు రోజులు పాటు సూర్యకిరణాలు స్వామివారి పాదాలు తాకుతాయని అర్చకులు వైకుంఠ రావు చెప్పారు.

నాగావళి నదిలో మునిగి యువకుడు మృతి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: నగరంలోని బాదంల్లపేటకు చెందిన పి రమేష్ (18) మృత్యువాత పడ్డాడు. నగరంలోని కలెక్టర్ బంగ్లా దరి నాగావలి నదికి స్నేహితులతో కలిసి స్నానానికి వెళ్లిన రమేష్ నదిలో స్నానం చేస్తూ ఊబిలో చిక్కుకొని రమేష్ మునిగిపోయాడు. వెంటనే అతని స్నేహితులు రమేష్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారంతా నదిలో గాలింపు చేపట్టారు. నదిలో దిగిన కొద్ది దూరంలో రమేష్ నీటిలో మునిగి కనిపించడం తో వారంతా బయటకు తీసి హుటా హుటిన శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిని తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రిమ్స్ అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుని తండ్రి గురయ్య గుజరాత్ లోని వీరావలికి వలస కూలీగా వెళ్ళాడు. మృతిని తల్లి గోవింద కన్నీరు మున్నీరుగా రోదిస్తోంది. మృతుడు నగరంలోని పోస్ట్ స్టిక్కరింగ్ షాపులో పనిచేస్తున్నాడు. మృతునికి చెల్లి భవాని ఉన్నారు.

పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మండల కేంద్రం సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990నాటి పదో తరగతి చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుంటూ, ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే ఇదే బ్యాచ్ లో చదివి అసువులు బాసిన వారికి ఘనంగా నివాళులు అర్పించారు. వివాహం, ఉద్యోగ, వ్యాపార రీత్యా వేరు వేరు ప్రదేశాలలో ఉంటున్న ఈ బ్యాచ్ మీట్స్ అంతా స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ అపూర్వ కలియక లో ఆనాటి ఉపాధ్యాయులు ను ఘనంగా సన్మానించారు. అప్పటి ఉపాధ్యాయులు విద్యార్థుల ఆహ్వానం మేరకు హాజరై పూర్వ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ, ఆనాటి విద్యార్థులు అందర్నీ గుర్తుపెట్టుకొని, ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించడం చాలా ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాఠశాల ప్రస్తుత ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అంగూరు రామారావు ఆధ్వర్యంలో అప్పటి ఉపాధ్యాయులు బి శ్రీరామమూర్తి, ఎస్ అప్పలరాజు, డి. సూర్యనారాయణ మాస్టారు లను ఘనంగా సన్మానించారు. అలాగే సి హెచ్ ధనుంజయ, ఎస్. షణ్ముఖ రావు, టి జనార్దన రావు లను కూడా సన్మానం చేశారు. ఈ కార్యక్రమం లో తాండస శ్రీనివాస్ రావు, కుసుమూరు లక్ష్మణ రావు, సిర్ల లక్ష్మి నారాయణ, కర్రి అప్పన్న, బొడ్డ ధర్మారావు సాహుకార చిట్టిబాబు తో పాటు 30మంది విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కవిటి: మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2006-2007 విద్యా సంవత్సరం కు చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులకు ఒకరినొకరు పలకరించుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయు వండి బలరామమూర్తి,నెయ్యిల విశ్వనాథం,పూడి శ్రీహరి తో పాటు పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపకలు అందజేశారు.

జబ్బవాపు వ్యాధి సోకిన పశువులు బతకటం కష్టం

పశువైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: జబ్బవాపు వ్యాధి బారిన పడిన పశువులు బ్రతకటం కష్టమని అందుకే ప్రతీ పాడి రైతు తమ పశువులకు ఉచిత జబ్బవాపు నివారణ టీకాలు తప్పని సరిగా వేయించుకోవాలని స్థానిక పశు వైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోగల కురుడు పంచాయతీ పరిధిలోగల పాకివలస, మెండపేట గ్రామాల్లో 114 పశువులకు ఆదివారం ఉచిత జబ్బవాపు వ్యాధి నివారణ టీకాలు వేయటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో ఈ టీకాలు షెడ్యూల్ ప్రకారం వేయడం జరుగుతున్నది కావున రైతులందరూ పశు వైద్య సిబ్బందికి సహకరించి .తమ యొక్క పశువులకు టీకాలు వేసుకునే బాధ్యతను తీసుకొని సరైన కాలంలో సక్రమంగా వేయించుకోవాలని వ్యాధులు రాకుండా నివారించుకుంటారని ఆయన కోరారు. ఈ వ్యాధి బారిన పడిన పశువులు ఎక్కువగా మరణిస్తుంటాయి. ఎక్కువగా మూడు మాసాల నుంచి ఏడు మాసాలు దూడలు ఈ వ్యాధి బారిన పడి 90శాతం దూడలు మృతిచెందుతాయి. ఈ వ్యాధి సోకిన పశువులు మేత ఆపడం, లేవలేకపోవడం ఎక్కువగా వెనుక కాళ్ల కండరాలలో గాలి చేరి, కణజాలము కుళ్లుతుంది. దీనివలన అధికంగా 104-105 డిగ్రీల జ్వరం వచ్చి చనిపోతుంటాయి. కావున పాడిరైతులు తమ పశువులను ఈ ఉచిత టీకాలు వేసుకోవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ కె.ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మృతుల ఆత్మశాంతికోసం క్యాండిల్ ర్యాలీ

విశాలాంధ్ర-పొందూరు : అంతర్జాతీయ ఎయిడ్స్ దినం సందర్భంగా మండలకేంద్రంలో ఐసీటీసీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఏడాది మే మూడవ ఆదివారం ఎయిడ్స్, హెచ్ఐవి మహమ్మారి బారినపడి మృతిచెందిన ఆత్మశాంతికి నివాళిగా ప్రపంచ వ్యాప్తంగా 115 దేశాలలో క్యాం డిల్ ర్యాలీ నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాన్ని మొదటిసారిగా 1983లో నిర్వహించారని ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్. రామోస్ తెలిపారు. ఈ సందర్భంగా రామ్స్ మాట్లాడుతూ ఎయిడ్స్ రోగుల పట్ల వివక్ష చూపకుండా వారితో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ క్రమం తప్పకుండా మందులు వాడితే ఎటువంటి ప్రమాదం లేదన్నారు. ఈ ర్యాలీలో పొందూరు ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అనిల్, ఐసీటీసీ కౌన్సిలర్ కె. నాగవళ్ళి, ల్యాబెక్నీషియన్ ఎం. విజయలక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు. స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అక్రమంగా కంకర తరలిస్తున్న మూడు లారీలు సీజ్

విశాలాంధ్ర-పొందూరు: మండలకేంద్రం పొందూరు రెవెన్యూ పరిధి పైడికొండ 42 సర్వేనం బర్లో అనుమతులు లేకుండా అక్రమంగా కంకర త్రవ్వి తరలిస్తున్న మూడు ట్రిపర్లారీ లను రెవెన్యూ అధికారులు సీజ్ చేసారు. మండలం బొడ్డేపల్లి వద్ద జరుగుతున్న ట్రాక్ పనులకోసం కంకమట్టి త్రవ్వకంకోసం సంభందిత కాంట్రాక్టర్ మండల తహసీల్దార్కు అనుమతులకోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే అనుమతులు మంజూరు చేయలేదు. కేవలం ధరఖాస్తు అందినట్లు రిసీవ్ ఇచ్చారు. దీనినే అనుమతులుగా చూపుతూ అక్రమంగా కంకరమట్టిని 10 రోజులుగా భారీగా తరలిస్తున్నారు. కొద్దిరోజులక్రితం హెచ్చరించినా యదావిధిగా కంకర తరలింపు చేపడుతున్నారు. దీనితో శనివారం తహసీల్దార్ కిరణ్ పాల్కు పిర్యాదు రావడంతో ఆర్. వీఆర్వో ఇద్దరు కానిస్టేబుల్లు దాడిచేసి మూడు ట్రిపర్లలారీలను సీజ్చేసి పోలీస్టేషన్కు అప్పగించారు. ఆసుతే పైడికొండ వద్ద భారీగా లోతుగా త్రవ్వడంతో ప్రక్కనున్న రైతులు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు.

పత్రికా సోదరులతో "గొండు" ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఫోర్త్ ఎస్టేట్‌గా పరిగణించే మీడియా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని శ్రీకాకుళం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ ముగిసిన అనంతరం పాత్రికేయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి కొత్త ఒరవడికకు ఆయన శ్రీకారం చుట్టారు. ఎన్నికల్లో జయాపజయాలను పక్కన పెట్టి మీడియా పరంగా సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన పాత్రికేయ సోదరుల ఆత్మీయ సమావేశంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో పాత్రికేయ వ్యవస్థ కీలకమని, సమాజంలో అధికార, ప్రతిపక్ష పాత్ర పోషించే అవకాశం వారికే ఉంటుందన్నారు. ప్రజాస్వామ్యం పరిడవిల్లాలన్నా, ప్రజాసంక్షేమం జరగాలన్నా మీడియా నిస్పక్షపాతంగా పనిచేయాలన్నారు. సమాజ శ్రేయస్సు కోసం కుటుంబాలను సైతం పక్కన పెట్టి జర్నలిస్టులు కృషి చేస్తున్నారని కొనియాడారు. వారి సంక్షేమం కోసం అధికారంలో వున్నా లేకపోయినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గొండు శంకర్ ఎవరో తెలియదన్న అధికార పక్ష ఆరోపణలు వాస్తవం కాదని.. రాష్ట్రం మొత్తం తన గురించి చర్చించుకునే స్థాయికి రావడానికి మీడియానే కారణమన్నారు. తనను అభ్యర్థిగా ప్రకటించక ముందునుంచే తన విజయానికి మార్గం వేసిన మీడియా మిత్రులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్డియే అధికారంలోకి వచ్చిన వెంటనే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శంకర్ హామీనిచ్చారు.

పలాస కాశీబుగ్గ ప్రజలకు తాగునీటి కష్టాలు..

కొళాయిల ద్వారా అర కొరగా తాగునీరు సరఫరా

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి పన్నుల రూపం లో కొట్లాది రూపాయలు ఆదాయం వస్తున్న ప్రజలకు నీటి కష్టాలు తీరడం లేదు. మున్సిపాలిటీ కొళాయిల ద్వారా వారానికి ఒక సారి మంచి నీరు సరఫరా చేసిన మురికి నీరు వాసన వస్తుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వివిధ విభాగాల నుంచి ఏడాదికి సుమా

రూ.10 కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. భూగర్భ జలాలు అడుగంటి పోవడం, పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేయడంలో పాలకవర్గం విఫలం కావడంతో పట్టణ ప్రజలకు తాగునీటి కోసం తిప్పలు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లో రూ. 800 లు ఇచ్చి నీటి ట్యాంకును కొనుగోలు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బోర్లు, పవర్ బోర్లు ఉత్సవ విగ్రహాలుగా ఉన్నాయే తప్ప ప్రజలకు ఉపయోగం లేని పరిస్థితి. కోట్లు ఆదాయం వస్తున్నప్పటికీ మున్సిపాలిటీలో మౌళిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గల 31 వార్డుల్లో సుమారు 63,400 జనాభా నివసిస్తున్నారు. పట్టణంలో సుమారు 185 హేండ్ బోర్లు, 135 పవర్ బోర్లు, ఐదు నేల బావులు కొళాయి పైపులైన్ ద్వారా పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. వేసవిలో నేల బావులు అడుగంటి పోయాయి. కేవలం రెండు బావులు,పారసంబ బోరు నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రతీ వ్యక్తికి రోజుకు 135 లీటర్లు నీరు అవసరం. ఆ లెక్క ప్రకారం పట్టణంలో నివాసం ఉంటున్న ప్రతీ ఒక్కరికి రోజుకు సుమారుగా 85.59 లక్షల లీటర్లు నీరు అవసరం. సాధరణ సమయాల్లోనే ఆ స్థాయిలో నీరు అవసరమైతే వేసవిలో అంతకు మించి నీటి అవసరం ఉంటుంది. కానీ ఆ స్థాయిలో మున్సిపల్ అధికారులు నీటిని సరఫరా చేయలేక పోతున్నారు. దీంతో పట్టణ ప్రజలు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు మాత్రం పట్టణ ప్రజలకు సుమారుగా 30 లక్షల లీటర్లు నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నామని చెబుతుండడం గమనార్హం.

నీటి ఎద్దడి ప్రాంతాలు ఇవే...

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఎక్కువగా పలాస బత్తుల వీధి, పెద్ద వీధి, కంచర వీధి, అన్నపూర్ణ ఆశ్రమం, గోరువీధి, హట్కో కాలనీ, రామ లక్ష్మణ కాలనీ, హరిజన వీధి, ఉదయపురం, రాజాం కాలనీ, ఉల్లాస పేట, కాశీబుగ్గ డెంకి వీధి, పల్లి వీధి, న్యూ కాలనీ, నెహ్రూ నగర్, శాంతినగర్ నెహ్రూ నగర్ శ్రీనివాస నగర్ లలితా నగర్ లేబర్ కాలనీ పద్మనాభపురం తదితర ప్రాంతాలలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. సాధారణ సమయంలో కాకుండా వేసవి కాలంలో నీటి ఎద్దడి మరింత తీవ్రంగా ఉంటుంది. కానీ ఆ ప్రాంత ప్రజలకు సకాలంలో కొళాయి నీరు సరఫరా చేయకపోగా ట్యాంకులతో నీటిని సరఫరా చేయడంతో ప్రజలు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.మున్సిపాలిటీ లో వారానికి ఒకసారి మున్సిపాలిటీ కొళాయి నీటిని సరఫరా చేస్తే ఏలా అని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలాస ప్రాంతాల్లో రాజాం కాలనీ, హరిజన వీధి, రామ లక్ష్మణ కాలనీ, మున్సిపల్ కార్యాలయం వీధి తదితర ప్రాంతాల్లో పది మంది చొప్పున నీటి ట్యాంకును రూ. 800 లకు కొనుగోలు చేసుకుంటున్నారు. కొనుగోలు చేసిన నీటిని దాచుకొనేందుకు ప్లాస్టిక్ డ్రమ్ము రోజుకు రూ.30లు చొప్పున అద్దెకు తెచ్చుకుంటున్నామని మహిళలు చెబుతున్నారు.

మరమ్మతులకు నోచుకోని బోర్లు... పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 185 బోర్లు ఉన్నప్పటికీ చాలా వరకు మరమ్మతులకు గురయ్యాయి. చాలా ప్రాంతాల్లో బోర్లు మరమ్మతులు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. పవర్ బోర్లు 135 ఉన్న ఆ స్థాయిలో బోర్లు పనిచేయడం లేదన్న వాదన ప్రజల నుంచి గట్టిగా వినిపిస్తుంది. పద్మనాభపురం పలాస పెద్దవీధి, కాశీబుగ్గ తిలక్ నగర్, తాళభద్ర తదితర ప్రాంతాల్లో పవర్ బోర్లు పాడైన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక మహిళలు చెబుతున్నారు. బాగు చేయాలని పదేపదే అధికారులకు చెబుతున్న ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలాస ఇందిరా నగర్ లో బోరు తవ్వి అలాగే విడిచి పెట్టారు. పలాస బత్తుల వీధి సమీపంలో పవర్ బోర్ పాడైందని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళినా ఫలితం లేకపోయిందని అక్కడ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తికాని మంచినీటి పథకం పనులు.... మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని మున్సిపల్ అధికారులు ఎఐఐబి పథకం కింద రూ. 100 కోట్లు వ్యయంతో మంచినీటి పథకం ఏర్పాటు చేసేందుకు సిద్ధం అయ్యారు. కానీ కేవలం పది శాతం పనులు కూడా జరగడం లేదు. కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ నుంచి పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు, లేబర్ కాలనీ, శివాజీ నగర్, సూది కొండ తదితర ప్రాంతాల్లో గోతులు తవ్వి పైప్ లైన్లు వేసి చేతులు దులుపుకున్నారు. వాస్తవానికి ఫేజ్ 1 లో పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్ షోర్ రిజర్వాయర్ నుంచి నీటిని మున్సిపాలిటీకి తరలించి అక్కడ నుంచి పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. కానీ ఆఫ్ షోర్ రిజర్వాయర్ పనులు పూర్తి కాకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచి పోయాయి. మున్సిపాలిటీ పరిధిలోని అన్నీ వీదుల్లో పైప్ లైన్లు వేసేందుకు పైపులు తెచ్చి పెట్టి అలాగే విడిచి పెట్టారు. ఏదీ ఏమైనా నప్పటికీ ఒక వైపు మంచినీటి పథకం పనులు జరగక పోగా మరోవైపు నేల బావులు అడుగంటి పోవడం, పాడైన పవర్ బోర్లు, హేండ్ బోర్లుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో పట్టణ ప్రజలకు తాగునీరు కష్టాలు వెంటాడుతున్నాయి. తాగునీరు సరఫరా కోసం ప్రత్యామ్నాయం చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్యాంకులతో నీరు సరఫరా... కమిషనర్

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో నీటి ఎద్దడి ఉందని అధికారులు గుర్తించి ఒక మున్సిపల్ ట్యాంకు, నాలుగు ప్రైవేట్ ట్యాంకులతో రోజుకు 30 ట్యాంకుల తో నీటిని సరఫరా చేస్తున్నాం. రెండు రోజులకు ఒకసారి పైపులైన్ ద్వారా ఒక రోజు కాశీబుగ్గ, మరుసటి రోజు పలాసకు నీటిని సరఫరా చేస్తున్నాం. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని గుర్తించి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ టి నాగేంద్ర కుమార్ తెలిపారు.